క్లుప్తంగా

గౌరీపట్నానికి పాదయాత్ర



గౌరీపట్నం బయలు దేరిన వైఎస్సార్ సీపీ అభిమానులు

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి విజయం సాధించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అభిమానులు కాలి నడకన గౌరీపట్నానికి సోమవారం బయలుదేరారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు లింగం శివప్రసాద్, దువ్వా వెంకటేష్, డాక్టరు వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్‌కు లోబడి మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరగనున్న ఈ కౌన్సిల్ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నాడు- నేడు రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఉమామహేశ్వరి

గొల్లప్రోలు: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నాడు-నేడు పనుల రికార్డులను తనిఖీ చేశారు. సోమవారం జీసీడీఓ(చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గర్ల్స్) పి.ఉమామహేశ్వరి గొల్లప్రోలు ఎంఈఓ కార్యాలయంలో నాడు-నేడు, మన బడి ఫేజ్-2 పనులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బీవీఎస్ ప్రసాద్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి పిఠాపురం నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశపు మందిరంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ సెంటర్‌లో చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆర్వో ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్టీయూలో జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు మండల తహసీల్దార్, ఎంపీడీవోలు ఇతర అధికారులు సమన్వయం చేసుకొని ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వరకట్న వేధింపులపై కేసు

కరప: వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు కరప ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యానాంకు చెందిన వెంటి నీలవేణికి కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ వెంటి నూకరాజుతో 2020లో వివాహమైంది. ఆ సమయంలో నీలవేణి తల్లిదండ్రులు రూ.5 లక్షలు, లాంచనాలు ఇచ్చారు. వీరికి 2021లో అమ్మాయి పుట్టింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడమే కాకుండా భౌతికంగా, మానసికంగా హింసిస్తున్నారని ఆమె కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త వెంటి నూకరాజు, మావయ్య తాతారావు, అత్తయ్య అనసూయ, ఆడపడచు యారికుర్తి దుర్గ, ఆడపడచు భర్త యారకుర్తి దుర్గారావులపై కేసు నమోదు చేశారు.

కుట్టుమెషీన్ అందజేత

బోట్‌క్లబ్: స్థానిక 29వ డివిజన్‌లోని కొయ్యావారి వీధిలో ఉన్న నిరుపేద మహిళ రెడ్డి రమ్యకు బీజేపీ రాష్ట్ర మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్ సోమవారం కుట్టు మెషీన్ అందించారు. బీజేపీ సాత్‌మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ రెడ్డి రమ్య ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని విషయాన్ని ముత్తా నవీన్‌కు తెలుపగా ఆమెకు సేవా సంపర్క్ అభిమాన్‌లో భాగంగా ఆమెకు కుట్టుమిషన్ అందించారు. బీజేపీ నాయకులు చెల్లూరి సత్యనారాయణ, బందర్ మిఠాయి నెహ్రూ, కొయ్యా లక్ష్మీనారాయణరెడ్డి, దొడ్డి వీరేంద్ర, మొసలగంటి సురేష్ పాల్గొన్నారు.

లే అవుట్లుగా పంట పొలాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఫ్లాట్ల విస్తరణ
- అనుమతుల్లేకుండా వ్యాపారం
- మామూళ్ల మత్తులో అధికారులు

కొత్తపల్లి: ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని అక్రమార్కులు పంట పొలాలను లేఅవుట్లుగా మార్చేసి, విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. మండలంలో శివారు ప్రాంతాల్లోని పంట పొలాలను ఇళ్ల స్థలాలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. కొత్తపల్లి, ఉప్పాడ, అమీనాబాద్, గోర్స, కొమరగిరి, కుతుకుడుల్లి, పొన్నాడ, వాకతిప్ప పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లు వేశారు. పంట పొలాలను కొనుగోలు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. కనీస అనుమతులు లేకుండా వీటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి తదనంతరం అధికారులు అనుమతులు పొందాల్సి ఉంది. అంతేకాకుండా ప్లానింగ్ అధికారులతో లేఅవుట్ అప్రూవల్ తీసుకోవాలి. నిబంధనలను అనుసరించి 30 నుంచి 40 అడుగుల వెడల్పు గల రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సదుపాయం, మంచి నీటి సౌకర్యం కల్పించాలని దీంతో పాటు మొత్తం లేఅవుట్ స్థలంలో 10 శాతం స్థలాన్ని కమ్యూనిటీకి కేటాయించాలి. కానీ ఇవేమి పట్టించుకోకుండా రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్టు వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. కాగా ప్రభుత్వానికి ఎటువంటి చెల్లింపులు లేకుండానే పంట భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేసి రోజుల వ్యవధిలోనే విక్రయిస్తున్న అక్రమార్కులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వివరణ కోరగా అనుమతి లేని లేఔట్‌లపై నోటీసులు జారీ చర్యలు తీసుకుంటామని చేస్తామన్నారు.



కుతుకుడుమిల్లిలో అనుమతి లేకుండా వేసిన లేఅవుటు



వాకతిప్పలో పంట పొలాన్ని గ్రావెల్‌తో పూడ్చేసిన దృశ్యం

రాజశేఖర్ సేవలు మరువలేనివి

మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: దివంగత మున్సిపల్ ఏఈ ఎం.రాజశేఖర్ సేవలు ఎన్నటికి మరచిపోలేమని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. రాజశేఖర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక పోలీసు రింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు సిబ్బంది ఏర్పాటు చేసిన పులిహోర, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 100 కేజీల పులిహోర, 200 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్ ఏఈగా పని చేసిన రాజశేఖర్ పట్టణ పరిధిలో ఉత్తమ సేవలు అందించారని, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు చెప్పారని అన్నారు. రాజశేఖర్ పని చేసిన సమయంలో తాను లేకపోయినా ఆయన సేవలను తెలుసుకున్నామన్నారు. చనిపోయిన ఉద్యోగులను పట్టించుకునే వారు లేని ఈ రోజుల్లో రెండేళ్లు గడిచినా ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించడానికి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కుమార్తెలు శ్రీదుర్గ, శ్రీకళ, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చిడుతూరి శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి. శ్రీనివాసరావు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిలి వీర వెంకటరామారావు, మున్సిపల్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సామర్లకోటలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలి

సామర్లకోట: పెద్దాపుర మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పంచాయతీ నుంచి స్వచ్ఛమైన తాగు నీరు అందజేయాలని ఎంపీడీఓ మాదిరెడ్డి ఉషారాణి అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 23 గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల వివరాలను తమ తెలియజేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఎంపీడీఓ చెప్పారు. నీటి సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీరు అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు,



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉషారాణి

విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగలు



పెద్దాపురం మేదర వీధిలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలు

సామర్లకోట: పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని అనేక విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయి దర్శనమిస్తున్నా విద్యుత్తు శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పిచ్చి మొక్కల తీగలు కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, అంతేకాకుండా ఈ మొక్కల తీగలు కింద భాగానికి వస్తే ఆ తీగల నుంచి విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని పెద్దాపురం పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ విద్యుత్తు తీగలపై పడుతున్న మొక్కలను తొలగించడానికి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు కానీ వాటిని మాత్రం తొలగించడంలేదు. పెద్దాపురం మెయిన్ రోడ్డు వినాయకుని గుడి సెంటర్ నుంచి మేదర వీధి వెళ్లు మార్గంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని పిచ్చి మొక్కలు అల్లుకున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని పెద్దాపురం ప్రజలు కోరుతున్నారు.

22 బైక్‌ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గోకవరం: స్థానిక డ్రైవర్స్ కాలనీలో సోమవారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ పర్యవేక్షణలో ఎస్సై కె.నాగరాజు కాలనీలో సిబ్బందితో కలసి కార్డెన్ సర్చ్ నిర్వహించి, రికార్డులు సక్రమంగా లేని 22 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రానున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేపట్టామని, వాహన యజమానులు రికార్డులు తీసుకువచ్చి వాటిని తీసుకు వెళ్లాలన్నారు.

హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రత

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురం, గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సూరంపాలెం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్‌లో పెరిగిపోయిన తుప్పలను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ప్రారంభించగా పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్ తమ సిబ్బందితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతనను మాట్లాడుతూ ప్రతి ఏడాది మే 15వ తేదీ నుంచి 31 వరకూ పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్ర మం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, శానిటరీ సిబ్బంది, పవర్ గ్రిడ్ అధికారులు కోటేశ్వరరావు, ఏఎస్ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

రెండు మోటారు సైకిళ్లు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం పెద్దాపురం నుంచి సామర్లకోట వస్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముందు వస్తున్న బైక్‌పై ఎలమిల్లి నుంచి అమ్మగారి ఇంటికి తన సోదరునితో వస్తున్న పెరుగుల లలితలను వెనుక పెద్దాపురం నుంచి వస్తున్న మోటారు సైకిల్‌లో ఉదయ్ అనే యువకుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లలిత సోదరుడు, ఆమెతోపాటు ఉన్న చిన్న పాపకు ఎలాంటి గాయాలు అవ్వలేదు. లలితకు, ఉదయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పెద్దాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లలిత స్థానిక గణేష్ కాలనీకి, ఉదయ్ అమ్మాణమ్మ అపార్టుకు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

ఉప్పుమళ్లు కప్పేయడంపై ప్రజల ఆందోళన

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి ఏఎస్ఆర్ కాలనీ ఆనుకొని ఉన్న ఉప్పుమళ్లను కప్పి చదును చేసి ఇళ్ల స్థలాలుగా మార్చివేసి అమ్మకాలు చేస్తున్న సంఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలలుగా ఉప్పుమళ్లను కప్పి ఇళ్ల స్థలాలుగా నాన్‌లేఅవుట్ ఇళ్ల స్థలాలు అంటూ కొందరు వ్యక్తులు అమ్మకాలు చేపట్టారు. ఈ ఉప్పుమళ్లను కప్పేందుకు భారీ వాహనాలతో రబ్బీస్‌ను రవాణా చేస్తున్నారు. ఈ వాహనాలు డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల ఈ కాలనీల్లో ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న ఇళ్లు ఊగిడం, నెర్రలు తీయడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నాన్ లేఅవుట్ స్థలాలంటూ అమ్మకాలు చేస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉప్పుమళ్ల కప్పుతున్న వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, రోడ్డు గుంతలు పడినా, కిందకి దిగిపోయినా పట్టించుకోవడంలేదన్నారు. ఇటీవల డ్రైనేజీలు వేసిన సమయంలో రోడ్డుపై వేసిన స్పీడు బ్రేకర్లను కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వేసినా అధికారులు వాటిని పట్టించుకోకపోవడం, లోడు లారీలు, కార్లు, మోటారుసైకిళ్ల రాకపోకలకు ఇవి తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. దీంతో ఉప్పుమళ్ల కప్పేందుకు లోడు లారీలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు పేర్కొంటూ ఉప్పుమళ్ల కప్పేస్తున్న వ్యక్తులు లారీలు, ట్రాక్టర్లు రాకపోకలకు అనుకూలంగా పెద్ద ఎత్తున జిగురు మట్టిని రోడ్డుపై డంప్ చేయడంతో ప్రజలు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. రోడ్డుపై మట్టిని తక్షణం తొలగించాలని, భారీ వాహనాలను ఆపాలంటూ నినాదాలు చేశారు. డ్రైవర్స్‌కాలనీ, ఏఎస్ఆర్ కాలనీల మీదుగా భారీ డంపర్లను రానిచ్చేదిలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని ఆయా కాలనీవాసులు హెచ్చరించారు.



ఎఎస్ఆర్ కాలనీలో ప్రధాన రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా వేసిన జిగురు మట్టి

సమాజ మార్పులో సంఘ సంస్కర్తల పాత్ర గుర్తించాలి

కాకినాడ సిటీ: సమాజ మార్పు కోరుకునే వారు ముందుగా సంఘ సంస్కరణ ఉద్యమ ప్రాధాన్యత గుర్తించాలని ప్రజా సాంస్కృతికోద్యమ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కచేరిపేట యూటీఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు (ఆర్వీస్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ×తెలుగు నేలపై సంఘ సంస్కరణోద్యమాలు¥ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముందుగా రఘుపతి వెంకటరత్నం నాయుడు చిత్రపటానికి మంతెన సీతారాం, డాక్టర్ చెలికాని స్టాలిన్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీతారాం ముఖ్యవక్తగా ప్రసంగించారు. బ్రిటిష్ కాలంలో కొంత మందికైనా చదువుకునే అవకాశం రావడంతో భారత సమాజంలో ఉన్న సతీసహగమనం వంటి అమానుష దురాచారాలపై రాజారామ్మోహన్‌రాయ్ వంటి మహనీయులు సంఘ సంస్కరణ ఉద్యమాలు చేశారన్నారు. తెలుగునాట కూడా వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, బ్రహ్మనాయుడు వంటి సంఘ సంస్కర్తలు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. రాజ్యాంగం ప్రకారం శాస్త్రీయమైన ఆలోచన, ఆచరణ పెంపొందించుకోవాలని సీతారాం సూచించారు. ఈ సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు టి.అన్నవరం, ఆర్‌వీఎస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీతారాం

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



న్యూరో ఫిజీషియన్ బెజవాడ కామరాజు సత్కరిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ బెజవాడ కామరాజు అన్నారు. స్థానిక బోట్ క్లబ్ వద్ద ఉన్న ఎస్‌కే సూపర్ స్పెషాలిటీ న్యూరాలజీ ఆసుపత్రిలో సోమవారం జాతీయ గ్రే దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకి మెదడు క్యాన్సర్‌పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెదడు క్యాన్సర్ వల్ల ప్రాణాంతక మెదడు కణితుల పెరుగుదలకు కారణమవుతుందన్నారు. మెదడులో ప్రారంభమై శరీరంలోని ఇతర భాగాల నుంచి మెదడులోకి వ్యాపించే అసాధారణ కణాల నిర్మాణం కారణంగా ఈ కణితులు ఏర్పడతాయన్నారు. మెదడు కణితుల ప్రాథమిక లక్షణాలు తలనొప్పి, వాంతులు, మూర్ఛ, మానసిక మార్పులు, దృష్టిలో సమస్యలు, అపస్మారక స్థితి, శారీరక కదలికలలో ఇబ్బంది, మాట్లాడటంలో ఇబ్బంది వంటివి కనబడతాయని తెలిపారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ ఆధ్వర్యంలో కామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, సతీష్, చైతన్య, కార్తీక్, స్వరూప్, ప్రజలు పాల్గొన్నారు.

వైద్యానికి చేయూత



సాయికుమార్‌కు చెక్కును అందిస్తున్న సంస్థ సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ 27వ డివిజన్‌కు చెందిన దొనె సాయికిరణ్(27)కి ఉన్నట్టుండి చిన్న మెదడులో రక్త ప్రసరణ ఆగిపోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, అతని మిత్ర బృందం వైద్యం కోసం అనేక ఆసుపత్రుల్లో ప్రయత్నాలు చేశారు. చివరకు బెంగళూరు నీమాన్ హాస్పిటల్‌లో అత్యవసరంగా ఆపరేషన్ చేయించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సాయికిరణ్‌కు చేయూత స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. రూ.25 వేలు తక్షణ సహాయంగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా చేయూత అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, అలీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టాల్లో ఉన్న తమ తోటి వారికి సహాయపడాలన్నారు. ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి, మహిళా సభ్యురాలు ఝాన్సీ, పవన్, రామకృష్ణ, మాధవ్, కార్తీక్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఐదుగురు ఏఆర్వోలు

శిక్షణను ఇచ్చిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించే ప్రక్రియ పర్యవేక్షించేందుకు ఐదుగురు ఏఆర్వోలను నియమించారు. ఏఆర్వోలుగా నియమితులైన ధర్మతేజ, కృష్ణార్జునరావు, రవికుమార్, లక్ష్మీప్రసన్న, కీర్తిలకు సోమవారం సాయంత్రం సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే వెంకటరావు శిక్షణనిచ్చారు. ఏఆర్వోలతోపాటు కౌంటింగ్ సూపర్‌వైజర్లు కూడా ఈ శిక్షణలో పాల్గొన్నారు. నాలుగో తేదీ ఉదయం 6 గంటలకల్లా విధులకు హాజరుకావాలని వీరిని ఆయన ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కరప: విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనం అలవర్చుకుంటే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు అన్నారు. వేళంగిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించి, గ్రంథాలయాలకెళ్లి, వార్తాపత్రికలు, జీకే వంటి పుస్తకాలను చదవాలన్నారు. సైన్స్‌పై అవగాహన కల్పించుకోవాలన్నారు. గణితం, పేపర్ ఆర్ట్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించి, అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లాకార్యదర్శి శ్రీరామారావు సైన్స్ ప్రయోగాలు చేసి, చూపించి మెళకువలను నేర్పించారు. లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యుడు ఎర్రా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



వేళంగి లైబ్రరీలో సైన్స్ ప్రయోగాలు చేసి చూపిస్తున్న రామారావు

సారా బట్టీలపై దాడులు

గోకవరం: గంగంపాలెం గ్రామ శివారులో సారా బట్టీలపై సోమవారం గోకవరం పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా బట్టీలో తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన సుమారు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లపై నిరంతర నిఘా

- పర్యవేక్షించిన ఆర్‌వో వెంకటరావు
- జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ

కాకినాడ: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులతో పాటు ఇద్దరు గెజిటెడ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌ల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, భద్రతపై ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేశారు. పర్యవేక్షణ అనంతరం అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పలువురు అధికారులు సిబ్బంది ఉన్నారు.



జేఎన్‌టీయుకేలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్వో వెంకటరావు